ప్రజాశక్తి
సోమవారం 2 సెప్టెంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు

నీట మునిగిన పంట పొలాలు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో గిరిజనులు సాగు చేసిన పంట పొలాలను నీట ముంచుతుంది. రంగిలిసింగి పంచాయతీ ముసర్లంక గ్రామంలోని కొర్రగాసి గిరిజనుడికి చెందిన సుమారు ఎకరం వరి పంట పొలం పూర్తిగా ఇసుక మేటలు కప్పేసింది. ఎంతో కష్టపడి సాగు చేసిన వరి పంట పొలం నీట మునగడంతో నష్టపోయామని బాధిత గిరిజనుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పంట పొలాలను స్థానిక గిరిజన సంఘం మండల నాయకుడు పి డొంబు, కే రాము, మోహన్‌దాస్ పరిశీలించారు. తక్షణమే నష్టపోయిన బాదిత గిరిజనుడికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నీట మునిగిన పొలం

రాజవొమ్మంగిలో ప్రమాద భరితంగా ప్రవహిస్తున్న గింజర్తి,ఎర్రంపాడు వాగు

కుండపోతతో అస్తవ్యస్తం!

- ఉప్పొంగి, ఉధృతంగా ప్రవహిస్తున్న కొండ వాగులు, గెడ్డలు
- జలదిగ్బంధంలో పలు గ్రామాలు, నిలిచిన రాకపోకలు
- వరి, పత్తి, ఇతర పంటలకు తీవ్రనష్టం
- ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు, నేతల పర్యటన
- సహాయక చర్యల్లో సిపిఎం నేతలు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-చింతూరు: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చింతూరు ఏజెన్సీలో కొండవాగులు ఉప్పొంగి రోడ్లపై ప్రవహించడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించి, జనజీవనం అస్తవ్యస్తమైంది. సోకిలేరు వాగు పొంగి, చింతూరు వీఆర్.పురం రెండు మండలాల రహదారిని స్తంభింపజేసింది. కుయుగురు వద్ద జాతీయ రహదారిపై వరద నీరు వచ్చి చేరడంతో ఆంధ్ర ఒడిస్సా రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కుంట ,సుకుమా మధ్య జాతీయ రహదారి 30 పై వరద నీరు ప్రవహించడంతో ఛత్తీస్‌గఢ్‌కు రవాణా నిలిచిపోయింది. ఏకధాటి భారీ వర్షాలకు మారేడుమిల్లి ఘాట్‌లో కొండ చరియలు విరిగే ప్రమాదం ఉందన్న హెచ్చరికలతో పాడేరు,చింతపల్లి, లంబసింగి, అరకు మరియు మారేడుమిల్లి, చింతూరు ఘాట్ రోడ్లపై రాత్రి 7 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు వాహన రాకపోకలను నిషేధించారు. జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 089 3529921 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. ఆదివారం మధ్యాహ్నానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 39.7 అడుగులకు చేరింది. చింతూరు వద్ద శబరి నీటిమట్టం కూడా 37.49 అడుగులకు చేరింది. కూనవరం వద్ద శబరి గోదావరి నదుల ప్రవాహస్థాయి 34.46 అడుగులకు చేరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. వాగుల వద్ద అధికారులు పడవలను ఏర్పాటు చేశారు.

ఎటపాకలో ధ్వంసమైన పత్తి పంట

అడ్డతీగల : మండలంలో మడేరు వాగు పరివాహక ప్రాంతమైన వేటమామిడి పంచాయతీ పలుకురాతిపాలెం, పైడి పుట్ట పింజరి కొండ, పరిసర ప్రాంతాలను ఆదివారం ఉదయం రంపచోడవరం ఐటిడిఎ పిఒకట్టా సింహాచలం, తహశీల్దార్ కృష్ణమాచారి, ఎంపిడిఒ విజయ రంగారావు, సిఐ నరసింహారావు , ఎస్ఐ అప్పలరాజు ఇతర అధికారుల బృందం పరిశీలించింది. వాగులు దాటి రాకపోకలు సాగించవద్దని ప్రజలను హెచ్చరించారు. విఆర్ఒ వెంకయ్యమ్మ, భాను ఉన్నారు.

ఎటపాక : కుండపోత వానతో మన్యం వణికి పోయింది. నందిగామ, ముర్రుమూరు, తోటపల్లి వాగులు ఉప్పొంగి ప్రవహించాయి. అలుగువాగు ప్రాజెక్టు నిండి, నీరు పొంగి ప్రవహించడంతో తోటపల్లి,కృష్ణవరం పంచాయతీ పరిధిలో పత్తి, వరి చేలు పూర్తిగా నాశనమయ్యాయి. త్రిపురపెంటవీడు పంచాయతీలో తోటపల్లి నుండి గొల్లగూడెం వెళ్లేదారి తెగి పోయి రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలకు తోడు కిన్నెరసాని, తాలిపేరు ప్రాజెక్టుల నుండి వస్తున్న నీటితో పాటు ఎగువ నుండి వస్తున్న వరదతో గోదావరి నీటిమట్టం క్రమేపి పెరుగుతుంది. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

బాధితుల కోసం సిద్ధం చేసిన పడవ

రాజవొమ్మంగి : కుండపోత వర్షాలతో మండలంలోని జడ్డంగి మడేరు వాగు, కింద్ర పెద్దేరు, లబ్బర్తి, ఒట్టిగడ్డ, గింజర్తి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో లబ్బర్తి, నెల్లిమెట్ల, వయ్యాడు బూరుగుపల్లి, గింజర్తి, ఎర్రంపాడు, తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి, జనజీవనం స్తంభించింది. ఎడతెరిపి లేని వర్షాలకు మన్యవాసులు ఇంటికే పరిమితమయ్యారు. కుండపోత వర్షాలతో ఉప్పొంగిన వాగులతో ప్రమాదం పొంచి ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్లల్లోంచి రావద్దని, అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి సూచించారు.

ఉప్పొంగిన వాగుల వద్ద పోలీస్ భద్రత

పోలీసు పికెట్‌ను పరిశీలిస్తున్న ఎఎస్‌పి జగదీష్ అడహాళ్లి

దేవీపట్నం : విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలతో దేవీపట్నం మండలం వెలగపల్లి గ్రామం వద్ద రహదారిలో ఉన్న కాజ్‌వే పైనుంచి ఉధృతంగా నీరు ప్రవహించడంతో రంపచోడవరం అడిషనల్ ఎస్‌పి జగదీశ్ అడహళ్లి అక్కడకు వెళ్లి పరిశీలించారు. కాజ్‌వేకు ఇరువైపులా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. వరద ఉధృతి తగ్గేవరకు ప్రజలను ఆ మార్గంలో రాకపోకలకు అనుమతించొద్దని పోలీసులను ఆదేశించారు. ఈసందర్భంగా ఎఎస్‌పి జగదీష్ మాట్లాడుతూ, ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు గెడ్డల మీదుగా రాకపోకలకు ప్రజలు సాహసించవద్దని సూచించారు. అలాగే మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని ఆదేశించారు. పోలీసులు,అధికారులకు ప్రజలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రాజవొమ్మంగి : జిల్లా ఎస్‌పి అమిత్ బర్ధర్ ఆదేశాల మేరకు రంపచోడవరం ఎఎస్‌పి జగదీష్ అడహళ్లి పర్యవేక్షణలో మండలంలో ఉప్పొంగిన వాగుల వద్ద రాజవొమ్మంగి సిఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ ఎస్.వెంకయ్య, సిబ్బంది వాగులు వద్ద ఆదివారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. వాగులు దాటకుండా రోడ్డుకు అడ్డంగా డ్రమ్ములు వేసి, వాటికి హెచ్చరిక స్టిక్కర్లు అతికించారు. ప్రజలు అటుగా రావద్దని హెచ్చరిస్తూ ప్రచారం చేశారు.

చింతూరు పిఒ 'అపూర్వ' ఔదార్యం

తన వాహనంలో బాధితులను ఎక్కిస్తున్న పిఒ అపూర్వ భరత్

విఆర్.పురం/చింతూరు :వరదల్లో చిక్కుకున్న బాధితులను తన వాహనంలో వాగు దాటించడం చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం మండలంలోని ముంపు ప్రాంతాల సందర్శనకు వెళ్లే క్రమంలో ఉలుమూరు నుంచి ఎజి.కోడేరు మధ్యలో ప్రధానరహదారిపైకి భారీగా వరదనీరు చేరడంతో ఒక మహిళ, పిల్లలతోపాటు మరికొందరు ముందుకు వెళ్లలేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతుండగా, అదే సమయంలో అటుగా వెళుతున్న పిఒ అపూర్వ భరత్ తన వాహనంలో వారిని వాగు దాటించారు. అంతేకాక అక్కడ తక్షణమే బోటు ఏర్పాటు చేయాలని తహశీల్దార్ సుబ్బారావు, ఎంఆర్ఐ రామకృష్ణలను ఆదేశించారు. పిఒ 'అపూర్వ'మైన చొరవ, ఔదార్యానికి బాధితులు ధన్యవాదాలు తెలిపారు.

సహాయక చర్యల్లో సిపిఎం బృందం

కాజ్‌వేలో చెత్త తొలగింపును పర్యవేక్షిస్తున్న సరోజిని

విఆర్.పురం: మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న భారీవర్షాలతో మండలంలోని రేఖపల్లి పంచాయతీ అన్నవరం, ఉమ్మడివరం మధ్యలో కాజ్‌వే వద్ద సహాయకచర్యలకు స్థానిక సిపిఎం సర్పంచ్ పూనం సరోజినితోపాటు సిపిఎం నేతలు చొరవ చూపారు. కాజ్‌వే పైనుంచి భారీ ఎత్తున నీరు ప్రవహించడంతో 40గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడం, అంతేకాక ఉధృతంగా నీరు ప్రవహించడంతో కాజ్‌వేకు ఇరువైపులా రోడ్డు కోతకు గుర్తై, ఏకంగా కొట్టుకుపోయే ప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొనడంతో, వెంటనే ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్, ఎసిపి, ఇతర అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.

వారు వచ్చేలోగా ప్రమాదం తీవ్రం కాకుండా ఉండేందుకు కాజ్‌వే సిమెంట్ పైపుల రంధ్రాల వద్ద అడ్డుకుపోయిన అడవిలోంచి కొట్టుకువచ్చిన కర్రదుంగలు, చెట్లు, చెదారం, ఇతర వ్యర్థాలను జెసిబిని రప్పించి తొలగించే చర్యలు చేపట్టారు. పైపులకు అడ్డుకున్న చెత్తాచెదారం తొలగించడంతో నీరు వాటిల్లోంచి సాఫీగా పారడంతో కాజ్‌వే వద్ద వరద పోటు, ఉధృతి తగ్గి, రాకపోకలకు మార్గం సుగమమైంది.

సర్పంచ్, సిపిఎం బృందం చొరవకు అభినందన

అనంతరం అక్కడకు చేరుకున్న చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వభరత్, ఎఎస్‌పి పంకజ్‌కుమార్ మీనా, ఇతర అధికారులు సర్పంచ్ సరోజిని చొరవను అభినందించారు. కాజ్‌వై వద్ద, అలాగే ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులను దాటకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని స్థానిక పోలీసులను ఎఎస్‌పి ఆదేశించారు. అనంతరం కాజ్‌వే వద్ద కుంగి, కోతకు గురైన రోడ్డును రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని జెడ్‌పిటిసి వాళ్ల రంగారావు, సర్పంచ్ పూనం సరోజిని, ఎంపిటిసి పూనం ప్రదీప్ సిపిఎం నేతలు పిఒ, ఎఎస్‌పి దృష్టికి తీసుకెళ్లారు.

దీనిపై పిఒ స్పందిస్తూ, కాజ్‌వే వద్ద అడ్డుకుపోయిన కొమ్మలు, దుంగలను తొలగించేందుకు రప్పించిన జెసిపి అందుబాటులో ఉన్నందున, వరద ఉధృతి తగ్గిన వెంటనే కాజ్‌వే వద్ద రోడ్డు పటిష్టపరచాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పూనం. సత్యనారాయణ, పంకు. సత్తిబాబు, తహశీల్దార్ సుబ్బారావు, ఎంపిడిఒ ఫణీంద్ర రెడ్డి, టిడిపి నాయకులు బీరక ప్రకాశవు, బొర్రా నరేష్, పోలీసులు, వెన్యూ సిబ్బంది, సచివాలయం సెక్రటరీ శివప్రసాద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తరుణ్, సచివాలయ సిబ్బంది బుచ్చిరాజు పాల్గొన్నారు.

పిఒకు సమస్యలను విన్నవిస్తున్న సర్పంచ్ సరోజిని

వర్షానికి తడుస్తున్న పిహెచ్‌సి భవనం శ్లాబ్

శిథిలావస్థలో పిహెచ్‌సి

- వర్షానికి కారుతున్న శ్లాబ్

ప్రజాశక్తి-హుకుంపేట:మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరింది. దీంతో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ఏర్పాటు చేసిన రూములు వర్షం కారణంగా కారి పోతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. భవనం శ్లాబ్ నుంచి నీరు లీకై కారి పోతుండడంతో అవస్థలకు గురవుతున్నారు. సుమారు 40 ఏళ్ల కిందట నిర్మాణం చేపట్టడంతో భవనాలు శిథిలావస్థకు చేరి పై పెచ్చులు ఊడి పడితున్నాయి. బాలింతలకు కేటాయించిన గదులు వర్షానికి విపరీతంగా కారుతోంది. గర్భిణీలకు, బాలింతలకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఐద్వా జిల్లా నాయకురాలు ఎస్ హైమావతి కోరారు. గర్భిణీ స్త్రీలకు మంచి రూములు ఏర్పాటు చేసి తల్లీబిడ్డ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

ప్రజాశక్తి-పాడేరు:జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ఈ నెల 2వ తేదీ సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలకు, ప్రభుత్వ శెలవు దినముగా ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు కూడా విధిగా సెలవు ఇవ్వాలని, ఎటువంటి తరగతులు నిర్వహించరాదని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సెలవును గమనించి పిల్లలను పాఠశాలకు పంపించరాదని సూచించారు. ఎట్టి పరిస్థితులలోనూ పిల్లలు వాగులు, గడ్డలు దాటరాదని కలెక్టర్ సూచించారు.

పంపిణీ చేస్తున్న యూనియన్ ప్రతినిధులు

బాధిత విద్యార్థులకు పండ్లు, రొట్టెల పంపిణీ

ప్రజాశక్తి -అనంతగిరి: కల్తీ ఆహారం తిన్న ఘటనలో అరకు ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న విద్యార్థులకు అనంతగిరి బొర్రా, ములియగుడ, మోటార్ ఫీల్డ్ యూనియన్ ప్రతినిధులు ఆదివారం పళ్ళు, రొట్టెలు పంపిణీ చేసినట్లు యూనియన్ ప్రతినిధి శ్యామ్, ఆర్.రాము లు పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు బాబి, సుధా, భీమరాజు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ఏడాది తర్వాత... స్పందించిన అధికారులు

- జాంగుడ పాఠశాలలో ఆర్ఒ ప్లాంట్ మరమ్మతు పనులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: జాంగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మరమ్మతుకు గురైన ఆర్ఓ ప్లాంట్ ను ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు స్థానిక ఏటి డబ్ల్యూఒ మల్లికార్జున్ పర్యవేక్షణలో ఆదివారం ఏడాది కాలం తర్వాత మరమ్మత్తు పనులు చేసి వినియోగంలో తీసుకువచ్చారు. ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి అభిషేక్ శనివారం జాముగూడ ఆశ్రమ పాఠశాలను సందర్శించి ఫుడ్ పాయిజన్ అయి అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఇచ్చిన హామీ ప్రకారం ఆర్వో ప్లాంట్ మరమ్మతు చేయించారు. ఆశ్రమ పాఠశాలలో మరమ్మతుకు గురైన తాగునీటి పథకాన్ని పరిశీలించి వెంటనే రిపేర్ చేసి వినియోగంలోకి తీసుకు రావాలని అధికారులను ఆదేశించారు. నిరుపయోగంగా ఉన్న తాగునీటి పథకం ఐటిడిఏ పిఓ చొరవతో వినియోగంలోకి తీసుకొచ్చారు. తాగునీటి అవసరాలకు, వంటలకు సురక్షితమైన నీటిని వినియోగించాలని పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించారు.

మరమ్మతు చేయిస్తున్న అధికారులు

కాలకృత్యాలకు తప్పని అవస్థలు

-మరుగుదొడ్లకు బోరు నీరే ఆధారం

-శిథిలావస్థలో నిరుపయోగంగా బావి

మరుగుదొడ్లకు ఈ బోరు నీరే ఆధారం

డుంబ్రిగుడ: జముగూడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో తాగునీటి కొరతతో ఆ పాఠశాల విద్యార్థులు ఏడాది కాలం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం నిర్మించిన ఆర్వో ప్లాంట్ గత ఏడాది క్రితం మరమత్తుకు గురై మూలన పడింది. దీంతో, విద్యార్థులకు సురక్షిత తాగునీరు సక్రమంగా అందడం లేదు. తాగునీటి మోటార్ సౌకర్యం ఉన్నప్పటికీ పూర్తి స్థాయిలో విద్యార్థులకు తాగునీరు అందడం లేదు. గతంలో నిర్మించిన తాగునీటి బావి ఉన్నప్పటికీ అది పూర్తిస్థాయిలో శిథిలావస్థలో చేరి నిరుపయోగంగా ఉంది. మరుగుదొడ్లకు బోర్ నుంచి నీటిని తోడుకొని విద్యార్థులు ఉపయోగించుకుంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

శిథిలావస్థలో ఉన్న బావి

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా.. అధికారులు అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు: మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. శనివారం రాత్రి 11:30 గంటల నుండి అర్ధరాత్రి ఒంటిగంట వరకు ఎస్పీ, ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులు, జిల్లా మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. అదేవిధంగా ఆదివారం మధ్యాహ్నం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మండల, డివిజన్, ఐటీడీఏ, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి 24 గంటలు పని చేసే విధంగా విధులు కేటాయించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం పశు నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పాడుపడిన పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, మట్టి ఇల్లు గుర్తించి ఆయా ప్రాంతాలలో మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పాడైన కల్వర్టులు, లో లెవెల్ కల్వర్టులు, విద్యుత్ స్తంభాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బండ రాళ్లు జారిపడే అవకాశం ఉన్నందున ఘాట్రోడ్లలో రాత్రిపూట ప్రయాణాలను నిషేధించాలని ఆదేశించారు. ప్రమాదం సంభవించిన తర్వాత నివేదికలు తయారు చేసే కంటే జరగబోవు ప్రమాదాలను, నష్టాలను ముందే గుర్తించాలని కలెక్టర్ సూచించారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ముంపు మండలాల్లో అప్రమత్తత అవసరం

పాడేరు:భద్రాచలం, శబరి నదులలో నీటి మట్టాలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో చింతూరు డివిజన్ పరిధిలోని ముంపు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ సూచించారు. ఆదివారం మీడియా కాన్ఫరెన్సులో అధికారులతో మాట్లాడారు. ముంపు మండలాల్లోని మండల స్థాయి నుంచి డివిజన్ స్థాయి అధికారులు అందరూ నిరంతరమూ అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. రానున్న నాలుగైదు రోజులపాటు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ప్రాణ ఆస్తి నష్టాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైన ప్రాంతాలలో బోట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగక ముందే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వారం రోజులకు సరిపడా రేషన్ సిద్ధం చేసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉన్నందున కిరోసిన్ కొవ్వొత్తులు ముందుగానే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా మండలాలలో గర్భిణీలను గుర్తించి బర్త్ వెయిటింగ్ హాల్స్ కు తరలించాలని, అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నదులు పొంగడంతో పాటు వర్షాలు కురుస్తున్నందున ప్రజలు నదులు వాగులు దాటకూడదని, చేపల వేటకు వెళ్ళరాదని కలెక్టర్ సూచించారు.

ప్రభుత్వంపై విమర్శలు తగవు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: జాంగుడ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో జరిగిన సంఘటనకు రాజకీయం చేసి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సరికాదని టిడిపి మండల అధ్యక్షులు టి సుబ్బారావు చెప్పారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఫుడ్ పాయిజన్ అయి సుమారు వందమంది విద్యార్థులు అస్వస్థతకు గురవడం చాలా దురదృష్టకరమైన విషయం అన్నారు. ఇలాంటి సంఘటనపై వైసిపి నాయకులు రాజకీయం చేయడం మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టి ఎన్ టి యు సి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, మాజీ సర్పంచ్ సిహెచ్ వెంకటరాజు, టిడిపి నాయకులు ఎం సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

తాండవ నీరు విడుదల

ప్రజాశక్తి-నాతవరం: మండలంలో తాండవ జలాశయం నీటిని డీఈ అనూరాధ సిల్వర్ గేట్ల ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ, నదిని ఆనుకుని ఉన్న ఆదాకుల, చమ్మచింత గుమ్మడికొండ తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.2400 క్యూసెక్కుల నీరు విడుదల చేసామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ ఈ సోమినాయుడు, ఏ.ఇ.లు రామకృష్ణ, శ్యామ్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలోని లింగాపురం, తంగేడు గ్రామాలలో నాకో నేతృత్వంలో మీకు తెలుసా కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్ పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు ప్రివెన్షన్ ఐంట్లో యాక్ట్ నిర్వాహకులు తెలిపారు. ఎయిడ్స్ పై అవగాహన కల్పించి ఎక్కువ మందికి పరీక్షలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక హెల్త్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : వర్షాల ప్రభావంతో దెబ్బతిన్న విద్యుత్ సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నామని ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఇంధనశాఖ కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశాలమేరకు ఎప్పటికప్పుడు అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తూ త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు, సెల్ టవర్లకు, అత్యవసర సర్వీసులు అందించే ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. ఈ చర్యల్లో భాగంగా అన్ని సెక్షన్ కార్యాలయాలకు జనరేటర్లు, పోల్ డ్రిల్లింగ్ యంత్రాలు, పవర్ సాలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, అవసరమైన సామగ్రి, సిబ్బందిని అందుబాటులో ఉంచడం ద్వారా పునరుద్ధరణ చర్యలను త్వరితగతిన చేపట్టగలిగామన్నారు.

వర్షాల కారణంగా ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని 5 సర్కిళ్లలోని 9 మండలాలు, 60 గ్రామాల్లో 3,299 సర్వీసు కనెక్షన్లు, 56 వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్తు అంతరాయం ఏర్పడగా యుద్ధప్రాతిపదికన సరిచేసినట్లు పేర్కొన్నారు. వినియోగదారుల నుంచి టోల్ ఫ్రీ నెంబరు 1912కు, కంట్రోల్ రూమ్ నెంబర్లకు వచ్చిన 2583 ఫిర్యాదులను కాల్ సెంటర్ సిబ్బంది ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి క్షేత్రస్థాయి సిబ్బందికి త్వరితగతిన తెలియజేయటం ద్వారా కేవలం ఒక్క రోజులోనే 2175 ఫిర్యాదులను పరిష్కరించగలిగామన్నారు. విద్యుత్తు అంతరాయాలకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నెంబర్ 1912కు, కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్లు - కార్పొరేట్ ఆఫీసు 9440816373, శ్రీకాకుళం 9490612633, పలాస 7382585630, టెక్కలి 7095875259, విజయనగరం 9490610102, విశాఖపట్నం 7382299975, రాజమండ్రి 7382299960, ఏలూరు 9440902926, సంబంధిత సెక్షన్ కార్యాలయాలకు తెలియచేసి పరిష్కారం పొందవచ్చని సిఎండి తెలిపారు.

అపార్ట్‌మెంట్ల నీటిలో పెట్రోల్, డీజిల్ వాసన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డు పరిధి అక్కయ్యపాలెం సంగం ఆఫీస్ కూడలిలో ఉన్న బిపిసిఎల్ పెట్రోల్ బంక్ చుట్టూ ఉన్న అపార్ట్‌మెంట్లలోని బోరు నీరు పెట్రోల్, డీజిల్ వాసన వస్తోందని సుగుణ అభిరామ్ అపార్ట్‌మెంట్ వాసులు సీతమ్మధార తహశీల్దార్ ఎం.రమేష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహశీల్దార్ ఎం.రమేష్ ఆధ్వర్యంలో వివిధ విభాగాల అధికారులు సర్వే చేపట్టారు. సివిల్ సప్లై, బిపిసిఎల్ ఆయిల్ కంపెనీ, గ్రౌండ్ వాటర్ విభాగం, పొల్యూషన్ బోర్డు, జివిఎంసి వాటర్ సప్లై, హెల్త్, శానిటేషన్ విభాగం అధికారులు పెట్రోల్ బంకును పరిశీలించారు. పెట్రోల్ బంక్ చుట్టూ ఉన్న బాధిత అపార్ట్‌మెంట్ వాసులతో మాట్లాడి వారి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఎనిమిది నెలలుగా పెట్రోల్, డీజిల్ వాసనతో నీరు వస్తోందని, వాడటానికి పనికిరాకుండా పోతుందని వివరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డిఎం అండ్ హెచ్ఒ జమాల్ బాషా

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలోని ప్రజలందరూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటిని నివారించేందుకు ఈ క్రింది చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కీటక జనిత వ్యాధులు అతిసారం వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచి వడపోసి చల్లారిన తర్వాత నీటిని తాగాలని, ప్రతిరోజు ఆహారం అప్పటికప్పుడు తయారు చేసిన ఆహారమును తీసుకోవాలని సూచించారు. ఇంటి యందు దోమలు, క్రిమి కీటకాలు లేకుండా శుభ్రముగా ఉంచుకోవాలని చెప్పారు. చేతులను శుభ్రం చేసుకోవాలని చెప్పారు. బయట ప్రదేశంలో చిరు తిండిలకు వీలైనంతవరకు దూరముగా ఉండాలన్నారు. ఇంటి పరిసరములలో చెత్త, చెదారం లేకుండా పరిశుభ్రముగా ఉంచుకోవాలన్నారు.ఇంటి పరిసరములలో పాత టైర్లు, బొంగాయ చిప్పల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. వ్యాధులు ప్రబలిన వెంటనే ఆశా కార్యకర్త, ఏఎన్ఎంలకు వెంటనే తప్పకుండా సమాచారం అందించాలని సూచించారు.

అంతర్జాతీయ క్రికెటర్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి-పెదబయలు:మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ బాలుర-1 పాఠశాలలో ఈ మాసపు అతిథి కార్యక్రమాన్ని హెచ్ఎం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇంటర్నేషనల్ ఉమెన్స్ బ్లైండ్ క్రికెటర్ వంతల నైని రవణిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం అందరిని ఆకట్టుకున్నాయి.ముందుగా ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవణి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి చదువు తో పాటు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని అన్నారు హెచ్ఎం యూనియన్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి . నాగేశ్వరరావు, హుకుంపేట వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెటర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

ముమ్మరంగా వరి నాట్లు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ముమ్మరంగా వరి నాట్లు సాగుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడన ప్రభావంతో మూడు రోజులు పాటు వర్షం కురవడంతో వరి నాట్లు ఊపందుకున్నాయి. మండలంలో వరి సాధారణ సాగు 4400ఎకరాలు కాగా, ఇప్పటికి సుమారు 2550 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పూర్తయ్యాయి. వర్షాలు సక్రమంగా లేక పోవడంతో ఖరీఫ్ సీజన్ ఇప్పటివరకు మందకొడిగా సాగింది. వాతావరణం అనుకూలించి ఉంటే జులై నెలాఖరు లేదా ఆగస్టు మొదటి వారానికల్లా వరి నాట్లు పూర్తయ్యి ఉండేవి. ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచే వరుణుడు ముఖం చాటేయడంతో వరి నాట్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. మూడు రోజుల పాటు కురిసిన వర్షానికి వరి పొలాల్లో వర్షపు నీరు వచ్చి చేరడంతో రైతులు మిగిలిన పొలాల్లో వరి నాట్లు వేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. మండలంలోని ఉపమాక ,కాగిత, ఉద్దండపురం, గొడిచెర్ల, డొంకాడ, వేంపాడు, ముకుందరాజుపేట, దేవవరం తదితర గ్రామాల్లో ఇప్పటి వరకు నాట్లు పడని వరి పొలాల్లో వరి నాట్లు వేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.3,4 రోజుల్లో ఆయా గ్రామాల్లో వరి నాట్లు పూర్తయ్యే అవకాశం ఉంది. వర్షం కురవడంతో ముమ్మరంగా వరి నాట్లు సాగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో సమృద్ధిగా నీరు ఉండడంతో ఇప్పటికే వరి నాట్లు వేసిన రైతుల్లోనూ ప్రస్తుత ఉడుపులు సాగిస్తున్న రైతుల్లోనూ ఆశలు చిగురించాయి .

కొండ ప్రాంతాన్ని పరిశీలించిన తహశీల్దార్

నివాసితుల వివరాల సేకరణ

ప్రజాశక్తి -కోటవురట్ల:పందూరు వద్ద కొండ చరియలు విరిగిపడి దెబ్బ తిన్న ఇంటితో పాటు పరిసర ప్రాంతాలను తహసిల్దార్ జానకమ్మ ఆదివారం పరిశీలించారు. ఇల్లు దెబ్బతిన్న మామిడి లక్ష్మి ఇంటిని పరిశీలించడంతో పాటు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె కొండ సమీపంలో నివాసం ఉంటున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల కుటుంబానికి నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి ఆషా, జనసేన పార్టీ స్థానిక నాయకులు భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

మాట్లాడుతున్న ఎస్‌పి అమిత్ బర్దర్

800 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురి అరెస్ట్ - ఎస్‌పి అమిత్ బర్దర్ వెల్లడి

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా చింతపల్లి -అన్నవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహన తనిఖీల్లో భాగంగా ముందస్తు సమాచారం మేరకు సుమారు 800 కిలోల గంజాయి పట్టుకున్నట్లు ఎస్పీ అమిత్ బర్గర్ వెల్లడించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో చింతపల్లి మండలం బలపం పంచాయతీ ఇటుక బెడ్డల గ్రామ శివారులో రవాణాకు సిద్ధం చేసిన గంజాయి ఉన్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు శనివారం సాయంత్రం తనిఖీ నిర్వహించి 18,50,000 రూపాయలు విలువైన 370.7 కిలోల గంజాయి పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు.

చింతపల్లి మండలం చౌడేపల్లి పంచాయతీ పరిధిలో ఆదివారం ఉదయం వాహన తనిఖీల్లో సుమారు 20 లక్షల రూపాయలు విలువైన 415.328 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ రెండు గంజాయి కేసులకు సంబంధించి నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసామని మరో ముగ్గురు పరారీ లో ఉన్నారని వెల్లడించారు. అల్లూరి జిల్లా ఏజెన్సీలో సమూలంగా గంజాయి నియంత్రణ లక్ష్యంగా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని ఆయన తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఏఎస్పీ ధీరజ్, చింతపల్లి అన్నవరం సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సీతమ్మధార : డైమండ్ పార్క్ సమీపంలో శనివారం రాత్రి రోడ్డు దాటుతున్న సమయంలో విద్యుదాఘాతానికి గురైన ఎస్.కోటకు చెందిన కల్యాణ్ (59) మృతిచెందాడు. ఎస్.కోట నుంచి ఉపాధి కోసం విశాఖ వచ్చి డైమండ్ పార్క్ ప్రాంతంలో ఒక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి పార్కు సమీపంలో రోడ్డు దాటుతున్న సమయంలో అక్కడ వైరుపడి ఉండడాన్ని గమనించి, దాన్ని పక్కకు పెట్టేందకు పట్టుకున్నాడు. విద్యుత్ సరఫరా ఉండటంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కెజిహెచ్‌కు తరలించినప్పటికీ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతనికి కుమార్తె, కుమారుడు ఉన్నారు కుమారుడు ఫిర్యాదు మేరకు ద్వారకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంసి రేడియాలజీ విద్యార్థినికి బంగారు పతకం

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర మెడికల్ కాలేజీ రేడియాలజీ విభాగం విద్యార్థిని డాక్టర్ పుష్పిత బంగారు పతకం, ధ్రువపత్రం అందుకున్నారు. ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ రాష్ట్ర 10వ వార్షికోత్సవ సమావేశం నెల్లూరులో మూడు రోజులు పాటు నిర్వహించారు. వార్షికోత్సవ సందర్భంగా రేడియాలజీ విభాగంలో వైద్యరంగంలో పేపర్ ప్రజెంటేషన్ పోటీలలో పుష్పిత అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం కెజిహెచ్ రేడియాలజీ విభాగం హెచ్ఒడి డాక్టర్ బుచ్చిబాబు అభినందనలు తెలియజేస్తూ రేడియాలజీ విద్యార్థులు చదువుతోపాటుగా పరిశోధనలు, నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ సురేంద్ర, నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా ఎన్నికైన డాక్టర్ సురేష్, వైజాగ్ రేడియాలజీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ కెఆర్.వర్మ తదితరులు పాల్గొన్నారు.

జిసిసి మేనేజర్ చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న డిఎం తదితరులు

చంద్రశేఖర్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - అడ్డతీగల : స్థానిక మండల కేంద్రంలో గిరిజన సహకార సంస్థ మేనేజర్‌గా పనిచేసిన చంద్రశేఖర్ సేవలు మరువలేనివని డివిజనల్ మేనేజర్ పార్వతీశం అన్నారు. చంద్రశేఖర్ ఉద్యోగవిరమణ సందర్భంగా ఆయనను దుశ్శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజవొమ్మంగి, మారేడుమిల్లి జిసిసి మేనేజర్లు విజయలక్ష్మి, రాజారెడ్డి మాట్లాడుతూ చంద్రశేఖర్ సేవలు కొనియాడారు. విశ్రాంత జీవితాన్ని సంపూర్ణంగా ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఆయన సేవలు, ఆలోచనలను గిరిజన సహకార సంస్థ అభివృద్ధికి అందించాలని కోరారు చంద్రశేఖర్ మాట్లాడుతూ విధుల నిర్వహణలో అన్నింటా తనకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. డిఎం పార్వతీశం, తోటి మేనేజర్లకు ధన్యవాదాలు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-కూనవరం :మండలంలోని పల్లూరు గ్రామానికి చెందిన ఆవుల వెంకటరామారావు(28)అనే యువకుడు విద్యుత్ షాక్‌తో దుర్మరణం పాలయ్యాడు. స్థానికంగా విద్యుత్ మరమ్మతు పనులు చేస్తూ, కుటుంబాన్ని పోషించుకుంటున్న వెంకటరామారావు, ఆ క్రమంలోనే ఆదివారం వేరొకరి ఇంట్లో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా, షాక్‌కు గురయ్యాడు. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్య, చిన్న పాప ఉంది. ఇంటిపెద్దదిక్కు, పోషణాధారం మరణంతో ఆ కుటుంబం దిక్కులేని దైందని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మధుచందనకు వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు

ప్రజాశక్తి - చింతూరు: అనకాపల్లి జిల్లా కేంద్రంలో శుక్ర,శని, ఆదివారాల్లో నిర్వహించిన 11వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు కస్తూర్బా విద్యార్థిని గుత్తుల మధుచందన + 81 కేటగిరి జూనియర్ విభాగంలో బంగారు పతకం, సబ్ జూనియర్ విభాగంలో రజతం, అలాగే సీనియర్ విభాగంలో రజత పతకాలు సాధించారు. పతకాలు సాధించిన మధుచందనను, కోచ్ గంగాధర్‌ను స్థానికులు అభినందించారు.

108లో గిరిజన మహిళ ప్రసవం

ప్రజాశక్తి -మారేడుమిల్లి: వై.రామవరం మండలం చింతలపూడి పంచాయతీ పరిధిలోని బొడ్డగుంట గ్రామానికి చెందిన గిరిజన మహిళ పల్లాల వీరలక్ష్మి ఆదివారం 108 వాహనంలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. పురిటినొప్పులతో బాధపడుతున్న ఆమెను ఫోన్‌కు స్పందించి వెంటనే వచ్చిన 108 వాహనంలో మారేడుమిల్లి తీసుకువస్తుండగా మార్గమధ్యలో రహదారి సౌకర్యం బాగోలేక నొప్పులు ఎక్కువ కావడంతో ఇఎంటి ఎం సుజాత, పైలట్ ఎం శంకర్ సహాయంతో పురుడు పోసుకుంది. పండంటి మగ బిడ్డను జన్మనిచ్చిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని ఇఎంటి సుజాత తెలిపారు. తర్వాత మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తదుపరి వైద్యపరీక్షలకు చేర్పించారు.

గిగ్ వర్కర్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : గాజువాకలో గిగ్ వర్కర్‌పై దాడికి పాల్పడిన పోలీస్ అధికారి కుమారునిపై చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా గిగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా గౌరవాధ్యక్షులు బి.జగన్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బిగ్ బాస్కెట్‌లో పనిచేస్తున్న గిగ్ వర్కర్ పార్సిల్ తీసుకెళ్తుండగా వెనుక నుంచి కారుతో వచ్చి గుద్దేయడమే కాకుండా ఆ వర్కర్‌పైన దాడి చేయడం దుర్మార్గమన్నారు. పోలీస్ అధికారి కుమారుడినన్న గర్వంతో ఈ దాడికి పాల్పడ్డారని జగన్ పేర్కొన్నారు.

డోలీ మోతలే శరణ్యం!

ప్రజాశక్తి -సీలేరు: మారుముల గిరిజన గ్రామాలకు నేటికీ రహదారి సౌకర్యం లేక గిరిజనుల పాలిట శాపంగా మారుతోంది. నేటికీ డోలిమోతలు తప్పడం లేదు జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ ములసల వీధి గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఆదివారం శెట్టి సన్యాసిపడాల్ అనే వ్యక్తి అస్వస్థతకు గురికావడంతో అతని కుటుంబసభ్యులు డోలితో మోసుకెళ్లి ఆసుపత్రిలో చేర్చారు. గ్రామానికి అంబులెన్స్‌కూడా రాలేని స్థితిలో ఫోను ద్వారా అంబులెన్స్‌కు సమాచారమిచ్చినప్పటికీ, వారు స్పందించిన వాహనం రాలేని స్థితిలో కుటుంబసభ్యులో డోలిలో మోసుకెళ్లి ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ సిబ్బంది వైద్య సేవలు అందించి మెరుగైన వైద్యం కోసం చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు.

సన్యాసి పడాల్‌ను డోలీలో మోసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

నిధులు మంజూరైనా జరగని రోడ్డు నిర్మాణం!

ధారకొండ నుంచి ములసలవీధి గ్రామానికి రహదారి నిర్మాణానికి 2021- 22లో అప్పటి ప్రభుత్వం రూ.1.40కోట్ల నిధులను మంజూరు చేసింది. దారకొండ నుంచి ములసలవీధి వరకు నాలుగు కిలోమీటర్ల మెటల్ రోడ్డుతోపాటు మధ్యలో ఐదు కల్వర్టుల నిర్మాణానికి నిధులు కేటాయిస్తూ, కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అయితే కేవలం రూ ఐదు లక్షలు వెచ్చించి, కేవలం గ్రావెల్ వేసిన ఆ కాంట్రాక్టర్‌మిగతా పనులు వదిలేయడతో ఇపుడు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు కురిస్తే రోడ్డు అధ్వానంతోపాటు వాగులు ఉప్పొంగడంతో కల్వర్టులేని స్థితిలో దాటి వెళ్లలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒ స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఇతర అధికారులు స్పందించి, రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

శోభాయమానంగా బాలభానుడు

ప్రజాశక్తి -సీలేరు: సూర్యోదయపు వేళ బంగారపు వర్ణంలో సూర్యకాంతులు వెదజల్లుతూ ప్రకృతి రమణీయమైన దృశ్యం ఆదివారం ఉదయం ఆవిష్కృతమైంది. జీకే వీధి మండలం సీలేరు ఎపి జెన్ కో గుంటవాడ రిజర్వాయర్ వద్ద ఉదయం 6 గంటలకు ప్రాత:కాల సమయంలో సూర్యోదయ సమయంలో ఆకాశం బంగారపు వర్ణంలో దగదగా మెరుస్తూ సూర్యుడు ప్రకాశవంతంగా ఉదయిస్తూ, లేలేత కిరణాలు కిరణాలు సీలేరు నదీ జలాలపై పడడంతో తళతళలాడుతూ మెరిసిపోయి, ప్రకృతి ప్రేమికులు, ప్రజల మనసులు దోచుకున్నాయి. ఎత్తైన కొండలు, దట్టమైన అడవులు ఆకుపచ్చని రంగులో చెట్లు అందాలతో సౌందర్యప్రేమికుల మనస్సులను హత్తుకునేలా ఆవిష్కృతమైన ఆ దృశ్యాన్ని ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు పర్యాటకులు, వాకర్స్ చూసి ఆనంద తన్మయులైపోయారు. ఈ సువర్ణభూషితమైన సుందర దృశ్యాన్ని ప్రజాశక్తి తన సెల్‌ఫోన్‌లో క్లిక్‌మనిపించింది.

సీలేరు ఎపి జెన్‌కో గుంటవాడ రిజర్వాయర్ వద్ద స్వర్ణభానుడు

'ప్రజాసేవ కోసమే పార్టీ పెట్టా'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజలకు మరింత సేవ చేయాలనే ఉద్దేశంతోనే 'ప్రజాసేవ' రాజకీయ పార్టీని స్థాపించానని సామాజికవేత్త డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పార్టీ వివరాలను వెల్లడించారు.

విద్యార్థులకు మెరుగైన వసతి, భోజనం అందించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థులకు మెరుగైన ఆహారం అందించడంతోపాటు మంచి వసతులు కల్పించాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు టి.శ్రీరామమూర్తి, జె.రవి ఆదివారం ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. వెయ్యి మంది నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురవడం దిగ్భ్రాంతి కలిగించిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి పరిస్థితులే ఉన్నాయని, మెనూ సక్రమంగా అమలు కావడం లేదని తెలిపారు.

3న రెండు జాబ్‌మేళాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 3న మంగళవారం విశాఖపట్నం జిల్లాలో రెండు జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయి కృష్ణ చైతన్య తెలియజేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పెదగంట్యాడలో ఉన్నటువంటి నేషనల్ అకాడమీ కనస్ట్రక్షన్ దగ్గర ఒక ఉద్యోగ మేళా, జైల్ రోడ్డులో ఉన్నటువంటి విశాఖ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్స్‌లో మరో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ డిప్లమో ఏదైనా డిగ్రీ చదివిన యువత అందరూ అర్హులని తెలిపారు. పెదగంట్యాడలో ఉన్న నేషనల్ అకడమిక్ సెంటర్‌లో ఇన్ఫోసోర్స్, సెనర్జిస్ కాస్టింగ్ లిమిటెడ్, ఎయిర్‌టెల్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, జిల్లాలో నిరుద్యోగ యువత హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు 8121743777 నెంబరును సంప్రదించాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులు గాజువాక, స్టీల్‌ప్లాంట్ ఏరియా, విశాఖపట్నం, అనకాపల్లి తదితర ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందని వెల్లడించారు.

వంతెనను పరిశీలిస్తున్న సర్పంచ్, సిపిఎం నేతలు

అసంపూర్తి వంతెనతో అవస్థలు

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని పెద్ద ఆర్కూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రేపాక ఆర్అండ్‌బి రోడ్డు నుండి గండి కొత్తగూడెం వెళ్లే రోడ్డు మధ్యలోపెద్ద వాగుపై వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలని పెద్ద ఆర్కూర్ సర్పంచ్ నాగమణి కోరారు. 2018లో మొదలుపెట్టిన బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని కోరారు. దాదాపు ఆరేళ్లు గడిచినా నేటికీ బ్రిడ్జి పూర్తి అవకపోవడంతో కొండరెడ్లు, 100 శాతం గిరిజనులు నివసించే పలు గ్రామాలకు రాకపోకలతోపాటు, అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా వెళ్లే పరిస్థితితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు రోజులుగా కురిసిన భారీ వర్షానికి బ్రిడ్జి దగ్గర అసంపూర్తిగా పనులతో గ్రావెల్ కొట్టుకుపోయి, రాకపోకలకు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. రేపాక నుంచి గండి కొత్తగూడెం వెళ్లే రోడ్డు సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవునా కంక రాళ్లు తేలి బైక్‌లు, పాదచారులకు నరకాన్ని చూపుతోందని వాపోయారు.. అధికారులు తక్షణమే స్పందించి, బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు తెల్లం తమ్మయ్య, వార్డ్ సభ్యుడు పండా లక్ష్మణరావు, మండల సిపిఎం నాయకులు మేకల నాగేశ్వరరావు, ఊయక కన్నయ్య , గ్రామస్తులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో పవన్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - విఆర్.పురం: ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు మండలం పొడుగునా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ తెలిపారు. జీడిగుప్ప, శ్రీ రామగిరి, సీతంపేట, రేఖపల్లి, చొక్కనపల్లి గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు, శ్రీరామగిరి ప్రాథమిక పాఠశాల పిల్లలకు బుక్స్ పెన్నులు, అంగన్వాడీ పిల్లలకు పలకలు పంపిణీ, స్కూల్ ఆవరణలో మొక్కలు నాటడం, రేఖపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు గర్భిణీలకు పాలు,పండ్లు, రొట్టెల పంపిణీ, వృద్ధులకు నిత్యావసరాలు అందజేత, ఇతర సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు సాయికృష్ణ తెలిపారు. మహిళలు, నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనివిజయవంతం చేయాలని కోరారు కార్యక్రమంలో మండల . కార్యదర్శులు బాగుల అంజనరావు, పెట్ట నాగేంద్ర, కోట్లరాజిరెడ్డి, పవన్, మణికంఠ ,శ్రీరామ్, సాయి బాబు తదితరులు పాల్గొన్నారు..

వాహన ఫైనాన్స్‌పై యుబిఐతో టికెఎం భాగస్వామ్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) వినియోగదారులకు సమగ్రమైన వాహన ఫైనాన్సింగ్ పరిష్కారాలను అందించేందుకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో భాగస్వామ్యం చేసుకుందని టొయోటా కిర్లోస్కర్ మోటార్ సంస్థ సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం మద్దిలపాలెంలోని టొయోటా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ పెరుగుతున్న కస్టమర్ల అవసరాలను తీర్చడం, టొయోటా వాహనాలను గతంలో కంటే మరింత మెరుగ్గా అందుబాటులోకి తీసుకురావడం, ఆకర్షణీయమైన సౌకర్యాలు అందించడంలో భాగంగా ఈ భాగస్వామ్యం చేసుకున్నామని తెలిపారు. అనంతరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ వ్యక్తిగత వినియోగం కోసం కొనుగోలు చేసిన ఏదైనా టొయోటా వాహనాల ఆన్-రోడ్ ధరపై 90 శాతం వరకు ఫైనాన్సింగ్‌ను అందించనున్నామన్నారు.

మెరైన్ ఎస్‌పిగా రవి వర్మ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మెరైన్ ఎస్‌పిగా పివిఆర్ఎస్ఎస్ఎస్ఎమ్‌వి.రవి వర్మ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు సిఐడి విభాగం అదనపు ఎస్‌పిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన ఉద్యోగోన్నతి పొందారు. ఆదివారం ఉదయం సిరిపురంలోని విఎంఆర్‌డిఎ కార్యాలయ ఆవరణలో రెండో అంతస్తులో ఉన్న మెరైన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.